# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-03-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి భూటాన్ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం "ఆర్డర్ ఆఫ్ ది డ్రూక్ గ్యాల్పో" ను ప్రదానం చేసింది.**

**2.** **సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లాల సరిహద్దుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లను ఆదేశించారు.**

**3.** **లోక్ సభ ఎన్నికల సందర్భంగా తెలంగాణాలో పలు ప్రవేశ పరీక్షల తేదీలలో తెలంగాణ ఉన్న విద్యామండలి మార్పులు చేసింది.**

**4.** **ఈ రోజు ప్రపంచ వాతావరణ అవగాహనా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

**5.** **జనసేన అధ్యక్షుడు కె. పవన్ కళ్యాణ్ తూర్పు గోదావరి జిల్లా నుండి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు.**

===========================

భూటాన్ దేశ పర్యటనలో వున్న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ దేశం తమ అత్యున్నత పౌర పురస్కారం "ఆర్డర్ ఆఫ్ ది డ్రూక్ గ్యాల్పోను ప్రదానం చేసింది. భూటాన్ లో రెండు రోజుల అధికార పర్యటన కోసం నిన్న థింపు చేరుకున్న నరేంద్ర మోదీ.... భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యెల్ వాంగ్ చుక్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారం డ్రూక్ గ్యాల్పోను అందజేశారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కొవిడ్ ఉధృతంగా ఉన్న క్లిష్ట సమయంలో అయిదు లక్షల టీకాలను అందజేసి భూటాన్‌ను ఆదుకున్నందుకు నరేంద్ర మోదీకి ఈ అత్యున్నత పౌర పురస్కారం అందజేస్తున్నట్టు జిగ్మే ఖేసర్ నాంగ్యెల్ వాంగ్ చుక్ తెలిపారు. భూటాన్ దేశ అత్యున్నత పౌర పురస్కారం అందుకున్న తొలి విదేశీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కావడం విశేషం.

ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ ... భూటాన్ నుండి ఈ పురస్కారం పొందడం తన జీవితంలో గొప్ప రోజని అభివర్ణించారు. ఇది భారతదేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు ఇచ్చిన గౌరవమని నరేంద్రమోదీ తెలిపారు. నరేంద్రమోదీ భూటాన్ పర్యటన సందర్భంగా ఉభయ దేశాల మధ్య సహకార విస్తృతికి సంబంధించి.. పలు ఒప్పందాలు కుదిరాయి.

-------------------------

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నందున రాజకీయ

పార్టీలు నిర్వహించే ఇంటింటి ప్రచారంతో సహా ఎటువంటి కార్యక్రమానికి అయినా అనుమతులు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కలెక్టర్లతో నిన్న ఆయన దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడుతూ .... ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు తాము నిర్వహించే ప్రచారానికి ఎటువంటి పరిస్థితులలోనూ అనుమతి పొందాలని స్పష్టం చేశారు. నేరుగా గానీ లేదా ఎంకోర్ పోర్టల్ ద్వారా గాని అందే దరఖాస్తులను వెంటనే పరిశీలించి ....అనుమతులు మంజూరు చేయాలని జిల్లాల కలెక్టర్లను ఆయన ఆదేశించారు. జిల్లాల పరిధులలోనే కాకుండా సరిహద్దు ప్రాంతాలలోనూ పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ...., ప్రతి సరిహద్దు చెక్ పోస్టు వద్ద ఒక కెమెరాతో పాటు స్టాటిక్ సర్వే లెన్స్ బృందాన్ని ఉంచాలని ...., ఎన్నికల.నిబంధనల మేరకు పోలీసు ...,.విద్యుత్ ..., రవాణా ...., తపాలా తదితర 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించామని ముఖేష్ కుమార్ మీనా వివరించారు.

---------------------------

లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణా రాష్ట్రంలో పలు ప్రవేశ పరీక్షల తేదీలలో మార్పులు చేస్తూ తెలంగాణా ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. మార్పు చేసిన పరీక్షల కొత్త షెడ్యూల్ ను నిన్న విడుదల చేసింది. గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మే 9 నుండి 12 వరకు జరగవలసిన E A P SET –మే 7 నుండి 11వ తేదీ వరకు జరుగుతుంది. మే 7, 8 తేదీలలో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు, మే 9, 10, 11 తేదీలలో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయి. జూన్ 4, 5 తేదీలలో జరగవలసిన ఐ సెట్ పరీక్ష జూన్ 5, 6 తేదీలలో నిర్వహిస్తారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో గ్రూప్ –1 దరఖాస్తులలో దొర్లిన తప్పుల సవరణకు తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్....టిఎస్‌పిఎస్‌సీ... అవకాశం కల్పించింది. ఈ రోజు ఉదయం పది గంటల నుండి ఈ నెల 27 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఈ వెసులుబాటు వుందని టిఎస్‌పిఎస్‌సీ కార్యదర్శి నవీన్ నికోలస్ నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్– 1 ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో పేరు ..., పుట్టిన తేదీ ...., విద్యార్హతలు వంటి అంశాలలో ఏమైనా పొరబాట్లు వున్న పక్షంలో వాటిని ఈ నెల 27వ తేదీ వరకు సరి చేసుకోవచ్చునని నవీన్ నికోలస్ తెలిపారు.

---------------------------

జన సేన పార్టీ అధ్యక్షులు కె. పవన్ కళ్యాణ్ తాను పోటీ చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నియోజక వర్గం నుండి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జన సేన పార్టీ నేతలతో నిన్న జరిగిన సమావేశంలో ఆయన ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రణాళికపై కూడా ఆయన ఈ సందర్భంగా చర్చించారు. వారాహి వాహనంలో ప్రచారం చేయాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. పిఠాపురం నియోజకవర్గంలోనే మూడు రోజులు ప్రచారం నిర్వహించనున్న పవన్ కళ్యాణ్ .... పిఠాపురం కేంద్రంగానే రాష్ట్ర స్థాయిలో జరిగే ప్రచారం పర్యవేక్షించనున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే ఏకైక అజెండాగా నేషనల్ డెమోక్రటిక్ అలెయన్స్.... ఎన్డీఎలో తెలుగు దేశం పార్టీ చేరిందని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో లోక్

సభ....., అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీ పోటీ చేస్తున్న అభ్యర్థుల మూడవ జాబితాను నిన్న ఆయన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంటులో ప్రస్తావించి .... వాటికి పరిష్కారం కోసం గట్టిగా పోరాడగల వారినే అభ్యర్థులుగా నిలబెడు తున్నట్టు జాబితా విడుదల సందర్భంగా ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజాభిప్రాయం మేరకే అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఆయన వివరించారు. ప్రజలంతా ఎన్.డి.ఎ. కూటమిని ఆశీర్వదించాలని చంద్రబాబు నాయుడు కోరారు.

-------------------------

లోక్ సభ ఎన్నికలకు సంబంధించి తెలంగాణా రాష్ట్రంలో పోటీ చేసే మరో ఇరువురు అభ్యర్థులను భారత రాష్ట్ర సమితి నిన్న ప్రకటించింది. నాగర్ కర్నూల్ స్థానానికి అభ్యర్థిగా ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, మెదక్ స్థానానికి పదవీ విరమణ చేసిన ఐ.ఎ.ఎస్. అధికారి వెంకట్రామి రెడ్డి పోటీ చేస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపింది.

-------------------------

లోక్‌సభ ఎన్నికల కోసం 15 మంది అభ్యర్థులతో కూడిన నాలుగవ జాబితాను భారతీయ జనతా పార్టీ నిన్న విడుదల చేసింది. ఈ జాబితాలో పుదుచ్చేరి, తమిళనాడుకు చెందిన పార్లమెంట్ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించింది. అంతకుముందు, 276 మంది అభ్యర్థుల పేర్లను పార్టీ విడుదల చేసింది.

-------------------------

వాతావరణ కాలుష్య నివారణా చర్యలపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. వాతావరణ మార్పులను అంచనా వేయడం....., భూతాపాన్ని తగ్గించడం....,.ప్రకృతిని పరిరక్షించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. అడవులను విచక్షణా రహితంగా నరికి వేయడం ...., పెట్రోల్ ...., డీజిల్ వంటి ఇంధనాలను ఇష్టా రీతిన వినియోగించడం .... వంటి చర్యలకు స్వస్తి పలకడం ద్వారా మనం వాతావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్రకృతి సమతూకాన్ని కాపాడుతూ ప్రస్తుత...., భవిష్యత్ తరాల వారికి ఉజ్వల భవిష్యత్ అందించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1950వ సంవత్సరం మార్చి 23న ప్రపంచ వాతావరణ సంస్థ ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఈరోజును ప్రపంచ వాతావరణ అవగాహన దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

-------------------------

సుస్థిర నీటి నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాన మంత్రి,భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నిన్న ప్రపంచ జల దినోత్సవం జరుపుకున్న సందర్భంగా, నీరు మన జీవితాలకు చాలా ముఖ్యమైనదని, ఈ విలువైన వనరును రక్షించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు.

-------------------------

చెన్నై వేదికగా నిన్న ఆరంభమైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుపై చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బెంగళూరు జట్టు నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు 18.4 ఓవర్లలోనే సాధించింది. చెన్నై జట్టులో

రచిన్ రవీంద్ర 37 పరుగులు ..., అజింఖ్య రహానే 27 పరుగులతో రాణించారు. చివరిలో శివం దూబే చేసిన 34 పరుగులు ..., రవీంద్ర జడేజా చేసిన 25 పరుగులతో చెన్నై సూపర్ కింగ్స్‌కు సునాయాస విజయం లభించింది.

ఇలా ఉండగా .... అంతకు ముందు చెన్నై చిదంబరం స్టేడియంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్.... ఐపీఎల్.... కొత్త సీజన్ ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కళ్ళు మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలు ...., లేజర్ షోలు ..., బాణసంచా విన్యాసాలు ఆహూతులను ఎంతగానో అలరించాయి. బాలీ వుడ్ హీరోలు అక్షయ కుమార్ ..., టైగర్ ష్రాఫ్‌లు నృత్యాలతో.., సోను నిగమ్..., శ్వేతా మోహన్ తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

---------------------------

భారత స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన ముగ్గురు స్వాతంత్ర్య సమర యోధులు సర్దార్ భగత్ సింగ్ ...., సుఖ్ దేవ్ థాపర్ ..., శివరాం రాజ్ గురుల ఆత్మార్పణను గుర్తు చేసుకుంటూ ఈరోజు అమరవీరుల సంస్మరణ దినం పాటిస్తున్నారు. 1931వ సంవత్సరం మార్చి 23వ తేదీన ప్రస్తుత పాకిస్తాన్‌లోని లాహోర్ పట్టణంలో ఈ ముగ్గురు యోధులను బ్రిటిష్ వలస పాలకులు ఉరి తీశారు. ఈ సంఘటన భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. దేశం కోసం ప్రాణాలను అర్పించిన ఈ అమరవీరుల సేవలను ప్రతి ఏటా మార్చి 23వ తేదీన భారతదేశ ప్రజలు గుర్తు చేసుకుంటూ... ఆ వీరులకు అంజలి ఘటిస్తున్నారు.

కాగా .... భారత స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుండి నడిపించిన మహాత్మా గాంధీ మరణించిన జనవరి 30వ తేదీని కూడా అమరవీరుల సంస్మరణం దినంగా పాటిస్తారు. 1948 జనవరి 30వ తేదీన నాథూ రామ్ గాడ్సే తూటాలకు మహాత్ముడు నేలకొరిగిన విషయం తెలిసిందే.

---------------------------

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ–ఇస్రో పుష్పక్– రీయూజబుల్ లాంచ్ వెహికల్ 'ఆర్ఎల్వీ ఎల్ ఈ ఎక్స్–02 ని విజయవంతంగా ప్రయోగించడం పట్ల ఇస్రో శాస్త్రవేత్తలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి, భారతీయ జనతా పార్టీ నాయకులు అనురాగ్ సింగ్ ఠాకూర్ అభినందించారు.

=====================